నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, మంగళవారం 25 జూన్ 2024 | KAMAREDDY

# కిక్కిరిసిన 'ప్రజావాణి'

- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన అర్జీదారులు
- 164 వినతులు స్వీకరించిన అధికారులు
- సమయం ముగియడంతో నిరాశగా వెనుదిరిగిన పలువురు



నిజామాబాద్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న అధికారులు

కంఠేశ్వర్, జూన్ 24: సమస్యల పరిష్కారానికి నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం అర్జీదారులతో కిక్కిరిసింది. నిజామాబాద్ సమీకృత కార్యాలయ సమావేశమందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి పెద్ద సంఖ్యలో అర్జీదారులు తరలివచ్చారు. దీంతో సమావేశ మందిరం నుంచి బయటి వరకు ప్రజలు బారులుతీరి కనిపించారు. అదనపు కలెక్టర్లు కిరణ్‌కుమార్, అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, డీఆర్డీవో సాయాగౌడ్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 164 వినతులు వచ్చాయని, వాటిని సత్వరమే పరిష్కరించాలని వివిధ శాఖల అధికారులకు సూచించారు. అంతకు ముందు నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు అజ్మీరా రాంజీ అకాల మృతిపై అధికార యంత్రాంగం సంతాపం తెలిపింది. పెండింగ్‌లో ఉన్న కళాశాల విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ప్రైవేటు కళాశాలల సంఘం నాయకులు అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

### నిరాశగా వెనుదిరిగి..

ప్రజావాణి కార్యక్రమానికి అర్జీదారులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో అధికారులు వినతులు స్వీకరించేందుకు కొంత ఆలస్యమయ్యింది. మధ్యాహ్నం 1.30గంటలకు అధికారులు సమావేశ మందిరం నుంచి వెళ్లిపోవడంతో కొంతమంది ఫిర్యాదుదారులు నిరాశతో వెనుదిరిగారు. మరికొంత మంది సమావేశ మందిర ద్వారం వద్ద ఎదురుచూసినా.. అక్కడ ఉన్న సిబ్బంది సమయం అయిపోయిందని, అధికారులు లేరని చెప్పారు. దీంతో ఫిర్యాదుదారులు వెనుదిరిగి వెళ్తున్న క్రమంలో అప్పుడే బయటికి వెళ్తున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌ను కలిసి అర్జీలు సమర్పించారు.

### ఒంటి గంట వరకే...

ప్రజావాణి సమయం మధ్యాహ్నం ఒంటి గంట వరకే. కానీ రెండు గంటలవరకు ఫిర్యాదులు స్వీకరించాం. సమయానికి లోపలికి వచ్చినవారి ఫిర్యాదులన్నీ తీసుకున్నాం. ఫిర్యాదుదారులు సమావేశ మందిరంలోనికి రాకపోతే ఏం చేస్తాం.

**- ప్రశాంత్, కలెక్టరేట్ ఏవో**



సమావేశ మందిరం ఆవరణ బయట బారులుతీరిన అర్జీదారులు

# బాన్సువాడకు అండగా ఉంటాం..




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, గంప గోవర్ధన్, హన్మంత్ షిండే, జాజాల సురేందర్

కామారెడ్డి, జూన్ 24: బాన్సువాడ నియోజకవర్గ ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు తామంతా అండగా ఉంటామని భారత రాష్ట్ర సమితి ఉమ్మడి జిల్లా మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, గంప గోవర్ధన్, హన్మంత్‌షిండే, జాజాల సురేందర్ అన్నారు. కామారెడ్డి పట్టణంలోని గంప గోవర్ధన్ నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరడం బాధాకరమన్నారు. పోచారంను సీనియర్ నాయకుడిగా గుర్తించిన కేసీఆర్ 2014లో వ్యవసాయ శాఖ మంత్రిగా, 2018లో రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా అత్యున్నత పదవులు ఇచ్చి గౌరవించారన్నారు. బాన్సువాడ నియోజకవర్గానికి రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా నిధులు ఇచ్చి అభివృద్ధి చేయించినట్లు తెలిపారు. కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచి కాంగ్రెస్ పార్టీలో చేరడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేసీఆర్ ఏం తక్కువ చేశాడని కాంగ్రెస్ పార్టీలో చేరారని పోచారంను ప్రశ్నించారు. కేసీఆర్‌ను, బీఆర్ఎస్ పార్టీని, బాన్సువాడ నియోజకవర్గ ప్రజలను మోసం చేయడం ఎంత వరకు న్యాయం అని అన్నారు. నియోజకవర్గ ప్రజలు ఎప్పటికీ క్షమించరని అన్నారు. బాన్సువాడ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి ఆపద వచ్చినా అండగా ఉండి కాపాడుకుంటామని, ఎవరూ అధైర్యపడొద్దని విజ్ఞప్తి చేశారు.

## పదేండ్ల పాలనలో

**పదేండ్ల కేసీఆర్ పాలనలో** నిర్విఘ్నంగా విద్యుత్ సరఫరా అయ్యేది. ఉమ్మడి రాష్ట్రంలో ఏర్పడిన కరెంటు ఇబ్బందులను స్వరాష్ట్రంలో కేసీఆర్ పరిష్కరించిండు. రెప్పపాటు కూడా కరెంటు కోత లేకుండా చూసిండు. రైతులకు, ఇండ్లల్లో నాణ్యమైన కరెంటు ఇచ్చిండు. రజక, నాయీబ్రాహ్మణ కులవృత్తులకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు 250యూనిట్ల వరకు ఉచితంగా సరఫరా చేసిండు. సబ్‌స్టేషన్లను పెంచి, అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను కేసీఆర్ మంచిగ చేసిండు.. అని ఉమ్మడి జిల్లా ప్రజలు, రైతులు, కులవృత్తిదారులు చెబుతున్నారు. కరెంటు రందిని తీర్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని కొనియాడుతున్నారు.

# నిరంతరం.. నిర్విఘ్నంగా



- కేసీఆర్ హయాంలోనే 24గంటల కరెంటు
- ఉచిత విద్యుత్తుతో కుల వృత్తులకు పూర్వవైభవం
- బీఆర్ఎస్ పాలనలో నాణ్యమైన కరెంటు



### కేసీఆర్‌కు రుణపడి ఉంటాం..

పొతంగల్, జూన్ 24: కేసీఆర్ పాలనలో కరెంటు సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండె. రెప్పపాటు కూడా కరెంటు పోయేది కాదు. కులవృత్తులు చేసుకునేటోళ్లను ఆదుకున్నడు. రజక, నాయీబ్రాహ్మణులను దృష్టిలో ఉంచుకొని 250యూనిట్ల వరకు ఉచితంగా కరెంటు ఇచ్చిండు. కేసీఆర్ సారు కృషితోనే ఫ్రీ కరెంటుతో ఇస్త్రీ దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నాం. ఇంత చేసిన కేసీఆర్‌కు రుణపడి ఉంటాం.

**- పద్మ, హంగర్గఫారం**



### పదేండ్ల ముందు మస్తు తిప్పలైంది..



ఉమ్మడి రాష్ట్రంలో వ్యవసాయానికి రాత్రి పూట కరెంటు వచ్చేది. అప్పుడు మస్తు తిప్పలైంది. రాత్రిపూట మోటర్ల దగ్గరే పడుకొనే వాళ్లం. కేసీఆర్ హయాంలో పదేండ్లు కరెంటు ఫుల్లుగా వచ్చింది. రంది లేకుండా చేసిండు. ఇప్పుడు మళ్లీ పాతరోజులు వచ్చేటట్లు కనిపిస్తున్నయ్. పంటలు వేసుకున్న తర్వాత సక్కగ కరెంటు ఇయ్యకపోతే మా పరిస్థితి ఎట్లనో ఏమో. తలుచుకుంటెనే భయమేస్తున్నది.

**- దొడ్డిమీద శేఖర్, రైతు**

### పదేండ్లలో కరెంటు కోతలు లేవు..

పొతంగల్, జూన్ 24: ఉమ్మడి రాష్ట్రంలో కరెంటు కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండేది. తెలంగాణ వచ్చిన తర్వాత సీఎంగా పదేండ్లపాటు కేసీఆర్ కరెంటు మంచిగ ఇచ్చిండు. లోవోల్టేజీ సమస్య లేకుండా చేసిండు. కరెంటు బాధలు తీర్చిండు. పరిశ్రమలు, వ్యవసాయానికి కచ్చితంగా కరెంటు అవసరమని, ఎంత ఖర్చయినా వెనుకాడకుండా ఎక్కడ కరెంటు అందుబాటులో ఉంటే అక్కడ నుంచి కొని.. 24గంటలు కరెంటు ఇచ్చిండు.

**- ముజీబుల్ రహమాన్, పిండిగిర్నీ యజమాని, హంగర్గఫారం**

# కుంటలోకి దూసుకెళ్లిన కారు.. ఒకరి మృతి

### వరద కాలువపై రివర్స్ చేస్తుండగా ప్రమాదం

వేల్పూర్, జూన్ 24: వరద కాలువపై కారు రివర్స్ తీస్తుండగా అదుపుతప్పి పక్కనున్న కుంటలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఓ రైతు మృతి చెందాడు. నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం పడిగెల్ గ్రామానికి చెందిన రైతు గాదేపల్లి రమేశ్ (55)కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రమేశ్‌కు పోచంపల్లి గ్రామ శివారులో పొలం ఉంది. అయితే, అక్కడి బండరాయి వాగు మత్తడిలో మోటారు దించేందుకు ఆయన సోమవారం తన కారులో వెళ్లాడు. వరద కాలువపై కారు నిలిపి తన పని పూర్తి చేసుకున్నాడు. తిరిగి వస్తుండగా కారు రివర్స్ చేసే క్రమంలో అదుపు తప్పి పక్కనే ఉన్న కుంటలోకి దూసుకెళ్లింది. దీంతో కారుతో సహా ఆయన నీట మునిగిపోయాడు. అక్కడున్న వారు 100కు కాల్ చేయగా పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చేరుకున్నారు. చేపలు పట్టే అశోక్, ఠాకూర్, కిషన్ సహాయంతో కారును బయటికి తీసి చూడగా రమేశ్ చనిపోయి కనిపించాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దవాఖానకు తరలించారు.

## మధ్యాహ్న భోజన బిల్లుల కోసం..

**మధ్యాహ్న భోజన బకాయిలు,** వేతనాలు చెల్లించాలని జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చే గౌరవ వేతనం, విద్యార్థులకు ఇచ్చే మెనూ చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి వంట చేసి పెడుతున్నామని అన్నారు. దీంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. పాఠశాలలు పునఃప్రారంభమైనా బిల్లులు రాలేవని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు. సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్, నాగరాజు, లక్ష్మి, లావణ్య, సోమలింగం తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి, జూన్ 24




కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

# తాగునీటి కోసం.. ఖాళీ బిందెలతో నిరసన

నాగిరెడ్డిపేట, జూన్ 24: తాగునీటి ఇబ్బందులు తీర్చాలని డిమాండ్ చేస్తూ నాగిరెడ్డిపేట మండల కేంద్రంలోని గోపాల్‌పేటలో ఉన్న సుభాష్‌చంద్రబోస్ కాలనీవాసులు ఖాళీబిందెలతో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో 150నల్లా కనెక్షన్లు ఉండగా వారం రోజులుగా నీటి సరఫరా చేపట్టడం లేదన్నారు. మిషన్ భగీరథ నీరు సైతం రావడం లేదని పేర్కొన్నారు. అధికారులు స్పందించకపోవడంతో నిరసన తెలిపామని, రేపటిలోగా తాగునీరు సరఫరా కానిపక్షంలో రాస్తారోకో చేస్తామని హెచ్చరించారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి కిష్టయ్యను వివరణ కోరగా.. వారం రోజుల క్రితం శక్కర్‌నగర్‌లో 40 ఏండ్ల నాటి ట్యాంక్‌ను కూల్చివేశామని, దీంతో ఒకే ట్యాంకు ద్వారా నీటి సరఫరా చేపడుతున్నామని, గ్రామంలో సగం వరకే సరిపోతున్నాయని తెలిపారు. కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేసే వరకు సమస్య పరిష్కారం కాదని పేర్కొన్నారు. ప్రస్తుతం ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. బోరు మోటరు ద్వారా తాగునీటి సరఫరా చేసి ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు.



గోపాల్‌పేట సుభాష్‌చంద్రబోస్ కాలనీలో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు



ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న జూనియర్ డాక్టర్లు

# సర్కారు నిర్లక్ష్యంపై సమరం..

### ప్రభుత్వ దవాఖాన ఎదుట జూనియర్ డాక్టర్ల సమ్మె

ఖలీల్‌వాడి, జూన్ 24: తమ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ దవాఖానలో సోమవారం నుంచి జూనియర్ వైద్యులు సమ్మె ప్రారంభించారు. దవాఖాన ఎదు ట ప్లకార్డులను ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జూడా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా తమకు రావాల్సిన నెలసరి వేతనాలు సకాలంలో అందడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. జిల్లా ప్రభుత్వ దవాఖానలో నిత్యం ఎంతోమంది పేద రోగులకు వైద్యమందించే తమపై ప్రభుత్వం నిర్లక్ష్యం వ్యవహరించడం సరికాదన్నారు. ఇటీవల రాష్ట్ర ఉపముఖ్యమంత్రి జూనియర్ వైద్యులకు సరైన వేతనం అందిస్తామని హామీనిచ్చి సరైన జీవో ఎందుకు విడుదల చేయలేదని మండిపడ్డారు. హైదరాబాద్, వరంగల్ తర్వాత అతిపెద్ద దవాఖాన అయిన నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానలో నిత్యం 200మంది జూనియర్ వైద్యులు విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. సమస్యలు పరిష్కరించకపోతే విధులకు హాజరయ్యేది లేదన్నారు. ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు తరహాలో జూనియర్ వైద్యులకు తెలంగాణలో కూడా సరైన వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర జూడ ఉపాధ్యక్షులు సురేశ్, హరితకృష్ణ, షఫీ తదితరులు పాల్గొన్నారు.